క్లుప్తంగా

విరాళం



నర్మెట: మండల కేంద్రంలో దుర్గామాత ఉత్సవాలను మార్చి 1, 2వ తేదీల్లో నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు బూస అంజయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా భక్తుల సహకారంతో ఆలయ కమిటీ అభివృద్ధి పనులను చేపట్టింది. కాగా, పద్మశాలి సంఘం రూ.50,116 అధ్యక్షుడు చింతకింది సురేష్ ఆధ్వర్యంలో కమిటీకి అందజేశారు. దన్నారపు మురళి, రత్నాకర్, సుధాకర్, భద్రయ్య, నేరేళ్ల సురేందర్ రూ.7,116 అందజేశారు. సంఘం ఉపాధ్యక్షుడు అనందాసు నాగరాజు, కోశాధికారి బండి రాజు, ప్రధాన కార్యదర్శి కందకట్ల వీరమల్లు, ఆలయ కమిటీ కోశాధికారి మడిపెద్ది స్వామి, సభ్యులు శేఖర్, సుధాకర్, సుదర్శన్, గోవర్ధన్, యాదగిరి, నాగభూషణం, సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



పాలకుర్తి: వల్మిడి గ్రామానికి చెందిన దండెంపెల్లి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, సోమవారం బాధిత కుటుంబానికి మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ రూ. 42,500 సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద అయిన మృతుడికి భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారని, దాతలు సాయం చేసి ఆదుకోవాలని కోరారు. బల్గుల ఉప్పలయ్య, వీరమల్ల బాబయ్య, పోతుగంటి నర్సయ్య, తండ మల్లయ్య, బీసు యాదగిరి, జూలూరి రమేష్, డోకూరి రాములు, కూటికంటి శ్రీనివాస్ ఉన్నారు.

మిత్రుడికి..




కొడకండ్ల: తమ మిత్రుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని రూ. 20 వేలు సాయం అందించి మిత్రబంధాన్ని చాటుకున్నారు. బెస్ట్‌ఫ్రెండ్స్ సొసైటీ ప్రతినిధులు కడగుట్టతండాకు చెందిన నిరుపేద దివ్యాంగుడైన మాలోత్ శంకర్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటికి రాగా విషయం తెలుసుకున్న బెస్ట్‌ఫ్రెండ్స్ సొసైటీ సభ్యులంతా సోమవారం బాధితుడికి సాయం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షులు మమతరాణి, అక్బర్, సంధ్యారాణి, రాజు, అరుణ్‌గోపాల్, అశోక్, రమేష్, యాకూబ్, న రేందర్, యాకూబ్ నాయక్‌లు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



జనగామ రూరల్: పట్టణంలోని సెయింట్ పాల్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ఎస్.మరియ జోసఫ్ తెలిపారు. సోమవారం జోసఫ్ మాట్లాడుతూ గత నెల 6వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన చుక్క లక్ష్మీబాయమ్మ టాలెంట్ టెస్ట్‌లో పాఠశాలకు చెందిన జె. చక్రిక, బి.శ్రీనిత్య, కె.మేఘనలు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో 2, 9, 10 ర్యాంకులు సాధించి హైదరాబాద్‌లో అవార్డులు అదుకున్నట్లు తెలిపారు. కాగా, అవార్డులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

పంటల పరిరక్షణకు చర్యలు



కాల్వను పరిశీలించేందుకు వెళ్తున్న ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల: ఎండల తీవ్రతతో ఎండుతున్న వరిపంట పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తెలిపారు. సోమవారం నవాబుపేట రిజర్వాయర్‌కు సాగునీరు చేరే శ్రీమన్నారాయణపురం (రఘునాథపల్లి) కెనాల్ కాల్వ వద్ద చేపడుతున్న మరమ్మతులను ఆమె పరిశీలించారు. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ మండలంలోని వాగు పరివాహక ప్రాంత చెక్‌డ్యామ్‌లు నింపడమేగాక, గొలుసుకట్టు చెరువుల పారకం పద్ధతిన వరి పంటలకు సాగు నీరు అందించి అన్నదాతలకు బాసటగా నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, విజయడెయిరీ జిల్లా అధ్యక్షుడు ధర్మారెడ్డి, ఉప్పల సురేష్‌బాబు, దశరథ వెంకన్న పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు

- శివపార్వతుల కల్యాణం కోసం ఏర్పాట్లు
- విద్యుత్ వెలుగుల్లో ఆలయాలు
- పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



జనగామ పాతబీటు బజార్ రామలింగేశ్వరస్వామి ఆలయం



జనగామ: చీటకోడూరు పంచకోసు రామలింగేశ్వరస్వామి ఆలయం



చిల్పూరు: బండలగట్టు ఆలయంలోని శివగంగేశ్వరుడు



పాలకుర్తిటౌన్: సోమేశ్వరస్వామి విగ్రహం



బచ్చన్నపేట: సిద్దేశ్వరాలయంలో గంగకు పూజ చేస్తున్న అర్చకులు



స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుత్ వెలుగుల్లో శివాలయం

జనగామ: హిందువుల పండుగల్లో మహాశివరాత్రి ప్రాశస్త్యమైనది. ఈ రోజు శివుడు లింగాకారంగా ఆవిర్భవించాడని శివపురాణం చెబుతోంది. ఏడాదిలో 12 శివరాత్రుల్లో, మహా శివరాత్రి అత్యంత పవిత్రమైనదిగా భక్తుల విశ్వాసం. శివుడికి బిల్వ పత్రాలతో అభిషేకం చేసి, రోజంతా ఉపవాసం ఉంటారు. రాత్రి జాగరణ సమయంలో శివ పూజలు, అభిషేకములు, పూజా కార్యక్రమాలతో శివ ధ్యానం చేస్తారు.

మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని జిల్లాలో ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఉత్సవాలు మొదలు కాగా, శివరాత్రి పర్వదినం, స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. వేలాదిగా తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు ఏర్పాటు చేస్తుండగా, వేసవి తాపం పెరగడంతో, టెంట్లు, పందిళ్లు వేయిస్తున్నారు. పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి, బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్దేశ్వరస్వామి, జనగామ మండలం చీట కోడూరు పంచకోసు రామలింగేశ్వరస్వామి, పట్టణంలోని పాతబీటు బజారు రామలింగేశ్వరస్వామి, చిల్పూరు మండలం ఫతేపూర్ పంచాయతీ పరిధిలోని బండలగట్టు శివగంగ రామేశ్వరాలయం ఆలయాల్లో మహా శివరాత్రి పండగ రోజు తెల్లవారు జాము 4 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషే కంతో పూజా కార్యక్రమాలు మొదలవుతాయి.

ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు

పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం సోమేశ్వరాలయంలో ఈ నెల24వ తేదీ నుంచి 1వ తేదీ వరకు బ్రహోత్సవాలు జరుగనున్నాయి. 26న మహాశివరాత్రి, అదేరోజు శివకల్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ నేతృత్వంలో ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తుండగా, శాంతిభద్రతలకు సంబంధించి డీసీపీ రాజమహేంద్రనాయక్ నేతృత్వంలో ఏసీపీ, సీఐల నిఘా నీడలో ఎస్సైలు పని చేస్తున్నారు.

బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్దుల గుట్టలో ఈ నెల24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలు సోమవారం నిర్వాహకులు ప్రారంభించారు. 26వ తేదీన మహా శివరాత్రి, అదే రోజు రాత్రి శివపార్వతుల కల్యాణతంతు నిర్వహించనున్నారు. పర్వదిం రోజు సుమారు 40వేల మందికి పైగా భక్తు వచ్చే అవకాశం ఉన్నట్లు వారు భావిస్తున్నారు.

చిల్పూరు మండలం పత్తేపూర్ పంచాయతీ పరిధిలోని బండలగట్టు శివగంగ రామాశ్వరాలయంలో 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు శివరాత్రి పర్వదినం ఉత్సవాలు జరుగనున్నాయి.

జనగామ మండలం చీటకోడూరు పంచకోసు రామలింగేశ్వర స్వామి ఆలయంలో 64వ వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబయింది. నేటి (మంగళవారం) నుంచి 28వ తేదీ వరకు మహోత్సవ వేడుకలు జరుగనున్నాయి. 26న శివరాత్రి, శివ కల్యాణం, పర్వతాల మల్లికార్జున స్వామి పెద్ద పట్నం, కల్యాణ మహోత్సవం, 28 తెల్లవారు జాము అగ్నిగుండ ప్రవేశంతో జాతర ముగుస్తుంది. జనగామలోని పాతబీటుబజారులో రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అభిషేకాలు నిర్వహించనున్నా రు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు.

కొమురవెల్లి జాతరకు ప్రత్యేక బస్సులు

శివరాత్రి పండగను పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి టెంపుల్‌కు జనగామ డిపో ఆధ్వర్యంలో నేటి(మంగళవారం) ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ స్వాతి తెలిపారు. 25వ తేదీన 25 ట్రిప్పులు, 26, 27న 40 బస్సుల(2వందల ట్రిప్పులు)ను ప్రతి పదిహేను నిమిషాలకు ఒక్కటి చొప్పున నడిపిస్తున్నట్లు స్పష్టం చేశారు. టికెట్ ధర పెద్దవా రికి రూ.100, పిల్లలకు రూ.50గా నిర్ణయించడం జరిగిందన్నారు. శివరాత్రి ఉత్సవాలకు కొమురవెల్లికి వెళ్లే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే పాలకుర్తి సోమేశ్వరస్వామి ఆలయానికి వెళ్లేందుకు ప్రతి పది నిముషాలకి ఒక బస్సు సిద్ధంగా ఉంచుతామన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి అదనపు సర్వీసులను సైతం నడిపిస్తామన్నారు. మరింత సమాచారం కోసం బస్టాండు ఎంక్వైరీ నంబర్ -7382926139ను సంప్రదించాలని అన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



ఈ నెల 26 మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని పాలకుర్తి సోమేశ్వరాలయంలో నిర్వహించనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కలెక్టర్ చాంబర్‌లో ఆలయ ఈఓ మోహన్ బాబు, అర్చకులు డీవీఎస్ శర్మ, సూపరింటెండెంట్ వెంకటయ్యలు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందించి, శాలువాతో సత్కరించారు. ఆర్డీవోలు గోపీరాం పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ రిలీజ్

చిల్పూరు బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో మార్చి 6వ తేదీ నుంచి 14 వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ రిజ్వాన్ బాషా తన చాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఆలయ అర్చకుల మంత్రోచ్చారణలతో కలెక్టర్‌ను సన్మానించి, ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీపీఓ స్వరూప, డీఎస్సీడీఓ విక్రమ్, డీవైఎస్ఓ వెంకట్‌రెడ్డి, పూజారులు పాల్గొన్నారు.

జీడికల్ వరకు దేవాదుల నీరు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

లింగాలఘణపురం: రాబోయే వర్షాకాలం వరకు జీడికల్ వరకు దేవాదుల నీరు తెచ్చి జీడికల్, గుమ్మడవెల్లి, సిరిపురం, రామచంద్రగూడెంలోని చెరువులు, కుంటలు నింపుతామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. అశ్వరావుపల్లి నుంచి వచ్చే ప్రధాన కాల్వ పనులను సోమవారం నెల్లుట్ల నుంచి జీడికల్ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జీడికల్‌లో విలేకరులతో మాట్లాడుతూ అశ్వరావుపల్లి ప్రధాన కుడి కాల్వ పనులు 18 ఏళ్లుగా పూర్తి కాకపోవడం, ఉప కాల్వల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని, కాంట్రాక్టర్లు, అప్పటి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శివకుమార్, వంశీధర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, రాజు, గణపతి, బిట్ల బాబు, అంజనేయులు, మల్లేశం, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

చర్మవ్యాధుల కలకలం

- ఏడునూతులలో పది మందికి ఎలర్జీ
- గ్రామంలో పర్యటించిన జిల్లా వైద్య బృందం



రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు

కొడకండ్ల: మండల పరిధి ఏడునూతుల గ్రామంలో చర్మవ్యాధులు కలకలం రేపుతున్నాయి. కొద్ది రోజులుగా పలువురు దురద, దద్దుర్లతో కూడిన చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. గ్రామంలో దాదాపు 200ల కుక్కలుండగా వాటికి కూడా స్కిన్ ఎలర్జీ ఉంది. కుక్కల ద్వారా చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తూ సమస్యను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డికి తెలియజేశారు. ఎమ్మెల్యే ఆదేశం మేరకు డీఎంహెచ్ఓ మల్లికార్జున్‌రావు, డీసీహెచ్ఎస్, చర్మవ్యాధి నిపుణుడు వీరాంజనేయులు, పీఓ కుడికాల భాస్కర్, వైద్య సిబ్బంది సోమవారం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి చర్మవ్యాధి ఉన్న రోగులను పరీక్షించారు. వీధి కుక్కలకు సోకిన వ్యాధిని కూడా పశువైద్యాధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ గ్రామంలో పది మంది చర్మవ్యాధితో బాధపడుతున్నారని, కుక్కలకు కూడా వ్యాధి ఉన్నప్పటికీ వాటి ద్వారా ప్రజలకు ఎలాంటి సమస్య లేదన్నారు. ఎండలో తిరుగడం, సరైన పరిశుభ్రత పాటించకపోవడం వల్లే కొందరు చర్మవ్యాధి, అలర్జీతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. వారందరినీ పరీక్షించి మందులు అందజేసినట్లు తెలిపారు. స్థానిక డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యాన గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతుందని, ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్నా వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



మహేందర్ (ఫైల్)

రఘునాథపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఆర్టీసీ ప్రైవేట్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన రఘునాథపల్లి–మేకలగట్టు రహదారిలోని రాంరాజుపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఫతేషాపూర్ గ్రామానికి చెందిన గడ్డం మహేందర్ (38) జనగామ ఆర్టీసీ డిపోలో ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం మేకలగట్టులో జరిగిన బంధువుల వివాహ వేడుకలకు తన ద్విచక్రవాహనంపై వెళ్లి అర్ధరాత్రి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. సోమరాజుపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో మహేందర్ తల, ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం తెల్లవారు జామున స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ స భ్యులు ఘటనా స్థలిలో మృతదేహంపై పడి రోదించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

భక్తులకు ఇబ్బంది కలగొద్దు

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

బచ్చన్నపేట : మహా శివరాత్రి సందర్భంగా కొడవటూరులోని స్వయంభూ శ్రీ సిద్ధేశ్వరాలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగొద్దు.. అవసరమైన ఏర్పాట్లు పటిష్టంగా చేయాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. సోమవారం ఆలయంలోని పుట్టు శివలింగానికి ఆర్డీఓ గోపీరావు, ఏసీపీ చేతన్ నితిన్ పలువురు అధికారులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అగ్నిగుండాలు, శివ కల్యాణం నిర్వహించే స్థలాలను పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, నర్మెట సీఐ అబ్బయ్య, ఎస్సై ఎస్‌కే.హమీద్, ఈఓ చిందం వంశీ, ప్రధాన పూజారి ఓం నమఃశివాయ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలి.. ఇందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూపారాణి అన్నారు. కొడవటూర్ గ్రామం, సిద్ధేశ్వరాలయ పరిసరాలను ఆమె పరిశీలించారు.

'సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి'



మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

జనగామ : బీజేపీ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలో జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ అధ్యక్షతన ముఖ్య నేతల సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మెతక వైఖరి అవలంభిస్తోందని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాజమౌళిగౌడ్, రామ్మోహన్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కేసులతో బీఆర్ఎస్‌ను అణిచివేయలేరు

- మాజీ మంత్రి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ఉనికి కోల్పోతున్న తరుణంలో క్షేత్రస్థాయి నుంచి మంత్రిత్వ మండలి వరకూ దిగజారుడు ఆరోపణలు, అక్రమ కేసులు బనాయించి బీఆర్ఎస్‌ను అణిచివేయలేరని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దేవరుప్పుల వాగు నుంచి ఇసుక తరలింపు విషయంలో స్థానికుల కోసం పాటుపడిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్‌రావు తదితరులపై అక్రమ కేసుల బనాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలో రబీసీజన్‌లోసాగు చేసిన వరి పంటల పరిరక్షణలో వైఫల్యం పొందిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అదనుదాటాక చేసే యత్నాల తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. పల్ల సుందర్‌రామిరెడ్డి, బస్వ మల్లేష్, కొల్లూరి సోమన్న, కృష్ణమూర్తి, ప్రవీణ్, అర్జున్, సుధాకర్, సోమనర్సయ్య, నర్సింహ్ములు, నవీన్‌నాయక్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడికి బెయిల్

దేవరుప్పుల: మండల కేంద్రంలోని వాగు నుంచి ఓ అభివృద్ధి పనులకు ఇసుక తరలిస్తుండగా చోటుచేసుకున్న ఘటన కేసులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ తదితరులపై నమోదైన కేసులో ఎట్టకేలకు సోమవారం రాత్రి బెయిల్ మంజూరు అయింది. సోమవారం స్వయాన దయాకర్‌రావు, యాకస్వామి పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. కాగా, జనగామ కోర్టుకు దయాకర్, యాకస్వామిలను హాజరు పర్చగా బెయిల్ దొరకడంతో బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం జెడ్పీఎస్ఎస్ 1991–92 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య స్మృతులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ధారణ శ్రీధర్, శ్రీనివాస్, నరోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంలో పురుగులు

- వాంతులు చేసుకున్న బాలుడు
- కస్టమర్ ఫిర్యాదుతో రంగంలోకి ఫుడ్‌సేఫ్టీ అధికారులు
- సూపర్ మార్కెట్‌కు రూ.20వేల జరిమానా





సూపర్ మార్కెట్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు, ఇన్‌సెట్‌లో (పురుగులు పట్టిన ఆహారం)

జనగామ: జిల్లా కేంద్రం సిద్దిపేట రోడ్డులోని ఓ సూపర్ మార్కెట్‌లో పట్టణానికి చెందిన ఉపేందర్ తన కుమారుడికి అదనపు శక్తి కోసం పౌష్టికాహారం ప్యాకెట్ కొనుగోలు చేశాడు. అందులోని పదార్థం తిన్న బాలుడు వాంతులు చేసుకోవడంతో అనుమానం వచ్చి చూడగా అందులో పురుగులు కనిపించాయి. సూపర్ మార్కెట్‌కు వెళ్లి అడగ్గా మరో ప్యాకెట్ తీసుకుని వెళ్లంటూ మేనేజర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఉపేందర్ తెలిపాడు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారి వినీల్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ పులి శేఖర్ సోమవారం సూపర్ మార్కెట్‌లో తనిఖీలు చేపట్టారు. సంబంధిత పౌష్టికాహారం ప్యాకెట్ రకానికి చెందిన వాటిని శాంపిల్ సేకరించారు. ల్యాబ్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని వినీల్ చెప్పగా.. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వాహకులకు రూ.20వేలు జరిమానా విధించినట్లు స్పెషల్ ఆఫీసర్ శేఖర్ తెలిపారు.

పరామర్శ

రఘునాథపల్లి: మాతృమూర్తిని కోల్పోయిన ములుగు అదనపు కలెక్టర్ చీమలపాటి మహేందర్‌జీ కుటుంబాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం వేర్వేరుగా పరామర్శించారు. మహేందర్‌జీ తల్లి రాధాబాయి (80) ఈ నెల 14న మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న కడియం, ఎర్రబెల్లి రఘునాథపల్లి మండల కేంద్రంలోని మహేందర్‌జీ నివాసానికి వెళ్లి అతని తల్లి రాధాబాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ తండ్రి మాజీ సర్పంచ్ మల్లాజీని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే యాదగిరిగుట్ట ఈఓ భాస్కరరావు.. అదనపు కలెక్టర్‌ను పరామర్శించారు. గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్‌చందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

నియామకం

లింగాలఘణపురం: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా జీడికల్‌కు చెందిన దేవరాయ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కన్వీనర్ దాసరి క్రాంతికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీహరి, ఎంపీ కావ్య, జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శివకుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రానికి చెందిన మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వద్లూరి మౌనికను మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ, రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు సోమవారం సన్మానించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో భాగంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు జిల్లా నుంచి పార్టీ సభ్యత్వాలు అత్యధికంగా చేసిన మౌనికను శాలువాతో సన్మానించారు.

క్రికెట్ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు పూర్తి

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెం గ్రామ యూత్ ఆధ్వర్యంలో నేటి నుంచి నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆర్గనైజర్స్ బొంకూరి మహేశ్, మంద మహేందర్, బొంకూరి దయాకర్ తెలిపారు. గ్రామ శివారులోని మైదానంలో క్రికెట్ టోర్నమెంట్స్ కోసం చేస్తున్న పనులను వారు పరిశీలించారు.

'ధరణి' కమిటీ సభ్యురాలి మృతి

బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ధరణి మహిళా మాక్స్ కమిటీ మండల సభ్యురాలు ఇమ్మడి కిష్టమ్మ(60) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలు గ్రామంలో ఎన్నో మహిళా సంఘాలను ఏర్పాటు చేసి మహిళలను చేర్పించి వారి అభ్యున్నతికి పాటు పడిందని గ్రామస్తులు తెలిపారు.

ఫ్యాన్ల బహూకరణ

బచ్చన్నపేట: కొడవటూర్ గ్రామంలోని సిద్ధేశ్వరాలయానికి పెద్దపహాడ్‌కు చెందిన ఈదులకంటి ఐలయ్య 12 ఫ్యాన్లను బహుకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి సోమవారం తెలిపారు. ఈఓ చిందం వంశీ, డైరెక్టర్లు నిమ్మ కర్ణాకర్‌రెడ్డి, రామకృష్ణ, తిరుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉత్తమ ఫలితాలు సాధించాలి



జఫర్‌గఢ్: పది పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉప్పుగల్లు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం పరహత్ కౌసర్ కోరారు. హోప్ ఫర్ ఫౌండేషన్ ఫౌండర్ హిమజరెడ్డి ఆధ్వర్యాన పల్లె రాజిరెడ్డి ఆర్థిక సాయంతో మండలంలోని పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సోమవారం అందజేశారు. సంస్థ ప్రతినిధులు భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వాడొద్దు



కొడకండ్ల: ఎన్నో అనర్థాలకు మూలమైన ప్లాస్టిక్‌ను వాడొద్దని కస్తూర్బా పాఠశాల ఎస్ఓ మమత కోరారు. సోమవారం ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందు కోసం మండలకేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్వప్న, ధనలక్ష్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి

లింగాలఘణపురం: మండలంలోని సిరిపురం, క్లాం గ్రామాల మధ్య ఉన్న కట్టమైసమ్మ దేవాలయాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా.మోహనకృష్ణ భార్గవ డిమాండ్ చేశారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు కట్టపై ఉన్న కట్టమైసమ్మ గుడిని, అందులోని అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన విషయం తెలుసుకుని సోమవారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆలయ ధ్వంసానికి పాల్పడిన దుండగులను గుర్తించి శిక్షించాలని కోరుతూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు మహేశ్, రాజు, విజయ్, దుర్గేశ్, నగేశ్, ఉమేష్, కృష్ణ, మణికంఠ తదితరులు ఉన్నారు.

ఎంవీఎఫ్ కార్యకర్తల సమ్మేళనం

పాలకుర్తి టౌన్: బాల కార్మికుల నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్(ఎంవీఎఫ్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2001–2010 వరకు పాఠశాలలో పని చేసిన కార్యకర్తలు 20 ఏళ్లకు కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంవీఎఫ్ జాతీయ కన్వీనర్, రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారు ఆర్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి ప్రాంతంలో 20 ఏళ్ల క్రితం ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో బాల కార్మిక నిర్మూలన, బాల్యా వివాహాలు రూపుమాపడం కోసం చేసిన కృషి మరువలేనిదన్నారు. పోరెల్లి లక్ష్మయ్య, వెంకటేష్, రణధీర్‌రెడ్డి, లలిత, ఎండీ రభియా, జోడు యాకన్న, ఎడవెల్లి సోము, గాదేపాక శ్రీనివాస్, మూల ప్రభాకర్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా పూల రవీందర్‌ను గెలిపించండి'

బచ్చన్నపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించాలని తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు తుప్పతి శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో పలు పాఠశాలలకు వెళ్లి రవీందర్‌ను గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్‌ను గెలిపించాలని తీన్మార్ మల్లన్న టీం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కలకోట బాబు కోరారు. సోమవారం పలు గ్రామాల్లో ఉపాధ్యాయులను కలిసి రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. రెండో ప్రాధాన్యతగా సుందర్‌రాజ్‌యాదవ్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

'కాంగ్రెస్ శ్రేణుల జోలికొస్తే ఊరుకోం'

దేవరుప్పుల: పదేళ్లపాటు అనేకవిధాలుగా అణిచివేయబడిన కాంగ్రెస్ శ్రేణులపై బీఆర్ఎస్ అదే తీరుతో వ్యవహరిస్తే ఊరుకునేదిలేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటమి ఎరిగిన ఎర్రబెల్లి రాజకీయ ఉనికి కోసం ఎన్ని పాట్లు పడినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని విమర్శించారు. సురేష్‌బాబు, ధర్మారెడ్డి, వెంకన్న, నర్సయ్య, భాస్కర్, యాకన్న పాల్గొన్నారు.